# టీచర్ల సర్దుబాటు రగడ

- సర్కారు నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాల నేతల అభ్యంతరాలు
- అనాలోచిత చర్య అని ఆగ్రహం
- ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో తప్పక సర్దుబాటు చేయాలని డిమాండ్



హైదరాబాద్, మే 31(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో మిగులు టీచర్ల సర్దుబాటుపై విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులు వివాదాస్పదమవుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని మెజార్టీ ఉపాధ్యాయ సంఘాలు తప్పుబడుతున్నాయి. ఇది అనాలోచిత, అసంబద్ధ నిర్ణయంగా అభివర్ణిస్తున్నాయి. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవరించి, ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్రంలో మిగులు టీచర్ల సర్దుబాటును జూన్ 13లోపే పూర్తిచేయాలంటూ విద్యాశాఖ శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. వాస్తవానికి జూన్ 12న బడులు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నెల 6 నుంచి 19 వరకు బడిబాట నిర్వహించనున్నారు. బడులు ప్రారంభమైన మరుసటి రోజులోపే టీచర్లను సర్దుబాటు చేయాలని అనడాన్ని మెజార్టీ ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.

### లక్ష చేసినా వృథానే

పాఠశాల విద్యాశాఖ పుండు ఒక చోట ఉంటే మందు మరోచోట రాస్తున్నదని టీచర్లు అభిప్రాయపడుతున్నారు. ప్రాథమిక పాఠశాలలకు తరగతికి ఒక టీచర్‌ను ఇవ్వకుండా లక్ష సంస్కరణలు చేసినా వృథానే అని అంటున్నారు. రాష్ట్రంలో చాలా ప్రైమరీ స్కూళ్లు ఒకరిద్దరు టీచర్లతోనే నడుస్తున్నాయి. ఐదు తరగతులున్న స్కూళ్లలో ఒకరిద్దరు టీచర్లతో విద్యార్థులకు న్యాయం జరుగుతుందా? అని ప్రశ్నిస్తున్నారు.

### ఆందోళనలో ఎస్జీటీలు

మిగులు టీచర్ల సర్దుబాటు పేరిట విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులపై సెకండరీ గ్రేడ్ టీచర్లంతా ఆందోళనలో ఉన్నారు. ఈ ఉత్తర్వుల బాధితులంతా ఎస్జీటీలే. సర్కారు బడుల్లో జూన్ 30 వరకు ఎన్‌రోల్‌మెంట్ కొనసాగుతుంది. అడ్మిషన్లు పెరుగుతుంటాయి. అడ్మిషన్లు పెరిగిన తర్వాత టీచర్లు లేకపోతే ప్రభుత్వ బడులపై నమ్మకంపోతుంది. పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో మేం ఎవరికి చెప్పుకోవాలో తెలియడంలేదు.

**-అనిల్‌కుమార్, ఎస్టీటీ ఫోరం నాయకుడు**

### ఇది అనాలోచిత చర్య

మిగులు టీచర్లను జూన్ 13లోపే సర్దుబాటు చేయాలనడం అనాలోచిత చర్య. ఇది తప్పుడు, అసంబద్ధ నిర్ణయం. తరగతికి ఒక టీచర్ ఉండాలని సాక్షాత్తు విద్యాకమిషన్ చెప్పింది. అధికారులేమో విద్యాకమిషన్ సిఫారసులకు విరుద్ధంగా, విద్యార్థుల సంఖ్యను బట్టి టీచర్లను కేటాయిస్తామంటున్నారు. 60 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లుంటే పాఠాలెలా చెప్పడం అర్థమైతలేదు.

**- మల్లికార్జున్‌రెడ్డి, ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్**

### సర్దుబాటు చేయాలి

మిగులు టీచర్లున్నట్టు జూన్‌లోనే ఎలా తేల్చుతారు. చాలా ప్రాంతాల్లో సర్కారు బడుల్లో విద్యార్థులు చేరేందుకు ముందుకొస్తున్నారు. మేం ఇంటింటికి తిరిగి పిల్లల నమోదును పెంచేందుకు ప్రయత్నిస్తుంటే.. అధికారులేమో బడుల్లో టీచర్లు లేకుండా చేస్తున్నారు. పిల్లలు చేరిన తర్వాత బడుల్లో టీచర్లు లేకపోతే ఎలా..? ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో చేయాల్సిన సర్దుబాటును జూన్‌లోనే చేయాలనడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. బడిబాట ముగిసిన తర్వాత ఆగస్టులో సర్దుబాటు చేయాలన్నదే మా ప్రధాన డిమాండ్.

**- మహిపాల్‌రెడ్డి, సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్**

## భాషా విధానాన్ని కొనసాగించాలి: హరగోపాల్



ఖైరతాబాద్, మే 31 : డిగ్రీ విద్యలో భాషా విధానాన్ని కొనసాగించాలని ప్రొఫెసర్ హరగోపాల్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో కవి, రచయిత నందిని సిధారెడ్డితో కలిసి మాట్లాడారు. యూజీసీ సూచనల మేరకు తెలంగాణ ఉన్నత విద్యామండలి డిగ్రీ తృతీయ సంవత్సరంలో భాషను తొలగించాలనుకోవడం సరికాదని పేర్కొన్నారు. అంతేకాకుండా 150 క్రెడిట్స్(తరగతులు) నుంచి 125కు కుదించారని, ఫలితంగా విద్యార్థులపై ప్రభావం పడుతుందని వాపోయారు. సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక ప్రతినిధి రాఘవచార్యులు, సిటీ కళాశాల తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నీరజ, ఆంగ్ల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఆది రమేశ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణ పాల్గొన్నారు.

## 4.4 కేజీలతో జన్మించిన శిశువు



*జూబ్లీహిల్స్, మే 31: రహ్మత్‌నగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన రుక్సర్ బేగం(22) రెండో కాన్పులో శనివారం మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే శిశువు సుమారు నాలుగున్నర కేజీల బరువు ఉండటంతో అందరూ అవాక్కయ్యారు. శ్రీరామ్ నగర్ ప్రసూతి దవాఖాన మాజీ సూపరింటెండెంట్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ రమారాణి ఆధ్వర్యంలో తల్లికి.. బిడ్డకు ఎలాంటి హాని జగగకుండా సాధారణ ప్రసవం చేశారు.*

## మెడికోల స్టైపెండ్ సమస్య తీర్చండి

### ఎన్‌ఎంసీ చైర్మన్‌ను కోరిన మంత్రి దామోదర

### 'నమస్తే తెలంగాణ'లో ప్రత్యేక కథనం.. సర్కారులో కదలిక

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): ప్రైవేటు మెడికల్ కాలేజీ విద్యార్థుల స్టైపెండ్ సమస్యను పరిష్కరించాలని నేషనల్ మెడికల్ కమిషన్ చైర్మన్ బీఎన్ గంగాధర్‌ను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ కోరారు. శనివారం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ఎన్ఎంసీ చైర్మన్‌తో బేగంపేటలోని టూరిజం ప్లాజాలో మంత్రి భేటీ అయ్యారు. స్టైపెండ్ విషయంలో విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు అందజేసిన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని చైర్మన్‌కు మంత్రి అందజేశారు. రాష్ట్రంలో ఒకేసారి భారీ సంఖ్యలో కాలేజీలు పెరిగినందున, ఫ్యాకల్టీ సర్దుబాటు, బిల్డింగుల విషయంలో అవసరమైన మినహాయింపులు ఇవ్వాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఎంబీబీఎస్ సీట్లకు అనుగుణంగా పీజీ సీట్లు లేకపోవడం వల్ల, ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లు ఇబ్బందులు పడుతున్నారని.. పీజీ సీట్ల సంఖ్యను కూడా పెంచుకునేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ ఆహ్వానం మేరకు వెళ్లిన ఎన్ఎంసీ చైర్మన్ గంగాధర్.. విద్యార్థులు, టీచింగ్ ఫాకల్టీతో సమావేశమయ్యారు.

## 'ఎంబీబీఎస్-ఆయుర్వేద' కోర్సుపై వివాదం

- ఆధునిక వైద్యం, ఆయుర్వేదను మిక్స్ చేయడంపై డాక్టర్ల అభ్యంతరం

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): ఎంబీబీఎస్, బీఏఎంఎస్ ఇంటిగ్రేటెడ్ కోర్సును ప్రవేశపెట్టాలని భావిస్తున్న కేంద్రం పుదుచ్చేరిలోని జిప్మర్‌లో కోర్సును ప్రవేశపెట్టనున్నట్టు ఇటీవల ప్రకటించింది. ఈ అంశంపై జాతీయ స్థాయిలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. రెండు వేర్వేరు వైద్య విధానాలను కలిపి కోర్సుగా అందించాలనే కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం అశాస్త్రీయమైనదని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఐఎంఏ, టీ-జూడా డిమాండ్ చేశాయి. చైనాలో ఆధునిక వైద్యం, సంప్రదాయ వైద్యాన్ని కలిపి అందించాలని చూశారని, అక్కడ విఫలమైందని టీజుడా రాష్ట్ర అధ్యక్షుడు ఇసాక్ న్యూటన్ తెలిపారు.

## ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు టీఏఎఫ్ఆర్సీ నోటీస్

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): మెడికోలకు స్టైపెండ్ ఇవ్వకపోవడంపై అందిన ఫిర్యాదు మేరకు ప్రైవేటు మెడికల్ కాలేజీలకు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ(టీఏఎఫ్ఆర్సీ) శనివారం నోటీసులు జారీ చేసింది. స్టైపెండ్ ఇవ్వకపోవడంతోపాటు విద్యార్థులను వేధిస్తున్నారని తమకు ఫిర్యాదులు అందాయని తెలిపింది. ఈ చర్యలు ఎన్ఎంసీ, యూజీసీ గైడ్‌లైన్స్‌కు విరుద్ధమని పేర్కొంది. ప్రైవేటు మెడికల్ కాలేజీలు విద్యార్థుల బ్యాంకు అకౌంట్లలో జమ చేసిన స్టైపెండ్ వివరాలను ఆధారాలతో జూన్ 10లోగా అందించాలని ఆదేశించింది.

## 'అగ్రి' అనుబంధ వర్సిటీల్లో దరఖాస్తుల ఆహ్వానం

వ్యవసాయ యూనివర్సిటీ (హైదరాబాద్) మే 31: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీ, కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన కళాశాల, పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి బీఎస్సీ వ్యవసాయం, బీఎస్సీ ఉద్యాన, బీటెక్ వ్యవసాయ ఇంజినీరింగ్, బీటెక్ ఆహార సాంకేతికత, బీఎస్సీ హోంసైన్స్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అగ్రి వర్సిటీ రిజిస్ట్రార్ విద్యాసాగర్ తెలిపారు. వివరాలకు www. Pjtau.edu.inను సంప్రదించాలని సూచించారు.

## హార్టికల్చర్ పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్

హైదరాబాద్ మే 31(నమస్తే తెలంగాణ): తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ పరిధిలో 2025-26 విద్యాసంవత్సరంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. జూన్ 26లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు www.skltghu.ac.in <http://www.skltghu.ac.in>ను లేదా 9603268682, 9121557037, 9398166973, 7075120145 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## శాంతిచర్చలపై నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

హైదరాబాద్ మే 31 (నమస్తే తెలంగాణ): సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు శాంతిచర్చల కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నామని పీస్ కమిటీ బాధ్యులు జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ జీ హరగోపాల్, కందిమల్ల ప్రతాప్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్‌రావు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, జాన్‌వెస్లీ, న్యూడెమొక్రసీ నేత వేములపల్లి వెంకట్రామయ్య తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.














